# సైన్స్ మాస్టారు

ఎస్.హనుమంతరావు

ఊరి చివర వున్న జిల్లా పరిషత్ స్కూలు. ఆరోజు నుండే వార్షిక పరీక్షలు. సమయం ఉదయం తొమ్మిదిన్నర. ఇంకో అరగంటలో పరీక్ష మొదలుకావాలి.

కాని పిల్లలు క్లాసు రూముల్లో తమకు కేటాయించిన సీట్లలో కూర్చుని పరీక్ష రాయడానికి సిద్ధంగా వుండాల్సిందిపోయి, అంతా స్కూలు ఆవరణలో గుంపులుగుంపులుగా నిలబడి ఏదో మాట్లాడుకుంటున్నారు.

సరిగ్గా స్కూలుకి బయలుదేరే సమయానికి ఒక స్నేహితుడు తమ ఇంటికిరావడంతో, అతన్ని పంపించి సైకిల్ తీసుకుని బయలుదేరేసరికి కొంచెం ఆలస్యమైంది సైన్స్ మాస్టారు ప్రకాశానికి. బాగా వేగంగా తొక్కి బడికి చేరుకున్నాడు.

స్కూలు ముందు గుంపులు గుంపులుగా వున్న పిల్లల్ని చూసి, 'పరీక్ష ఎందుకైనా క్యాన్సిల్ అయిందా... లేదా ఏమైనా స్ట్రైకా?' అని అనుకుంటూ సైకిల్ దిగి, ఆవరణలోకి వచ్చి స్టాండులో సైకిల్ పెట్టాడు. స్కూలు పోర్టికో కింద హెడ్‌మాస్టారు, ఇతర మాస్టార్లు నిలబడి వుండడం చూసి అటు కదిలారు.

దూరంగా వుండగానే హెడ్‌మాస్టారు నరసింహం గారి పిడుగుల్లాంటి మాటలు వినిపించాయి. ఆయన మాటలు చాలా కోపంగా వున్నాయి. 'అసలే కోపి, ఆపై బి.పి' అనుకున్నాడు ప్రకాశం. 'ఎవరి మీద కోపం?...ఇంతకీ విషయం ఏమిటి?' అని అనుకుంటూ హెడ్‌మాస్టారికి విష్‌చేసి, తన కొలీగ్స్ పక్కగా నిలబడ్డాడు ప్రకాశం.

"ఏమైంది?" అడిగాడు పక్కనున్న తెలుగు మాస్టారు ప్రసాద్‌ని.

"హెడ్‌మాస్టారు ఇంటినుండి స్కూలు తాళాలు తెస్తూ, వాటిని నూతి అంచుమీద పెట్టి, బకెట్‌తో నీళ్లు తోడుకుని కాళ్ళూ చేతులూ కడుక్కుంటున్నాడట ప్యూన్ మూర్తి. ఈలోగా బకెట్ తాడు తగిలి తాళాల గుత్తి కాస్తా నూతిలో పడిపోయిందట. ఇంకో అరగంటలో పరీక్ష మొదలవ్వాలి... ఆ తాళాలు నూతిలో పడ్డందుకు హెడ్‌మాస్టారి రంకెలు... ఇందాకటి నుండి గేలంతో ట్రై చేస్తున్నా తాళాల గుత్తి రాలేదు... తలుపులు తెరిచే దారిలేక అంతా బయటే వుండిపోవాల్సి వచ్చింది" చెప్పాడు.

"అవును, సమయానికి పరీక్షలు ప్రారంభం కాకపోతే, స్కూలు పరువు పోతుంది. పత్రికల వాళ్ళు ఏకుతారు. పై అధికారులు ఊరుకోరు పాపం!... ఆయన టెన్షన్ పడ్డారంటే అర్థముంది" అన్నాడు ప్రకాశం.

"ఇంకేం దారిలేదు... అన్ని గదుల తాళం కప్పలూ బద్దలు కొట్టాల్సిందే - ఆలస్యం అనవసరం" అదో మాదిరి ఉత్సాహంతో అన్నాడు డ్రిల్‌మాస్టారు సాంబిరెడ్డి.

"ఏ పక్కింటినుంచైనా సుత్తి తీసుకురావడానికి తొందరగా తగలడు" నరసింహంగారు అరిచారు మూర్తివైపు తిరిగి. ఒక్క పరుగులో పక్కింటికి వెళ్ళి, పెద్ద సుత్తితో తిరిగొచ్చాడు మూర్తి.

"ఇంకా చూస్తావేం? ... అన్నిగదుల తాళాలూ పగలగొట్టు!" హూంకరించారు నరసింహం. అంతేకాదు "ఈ తాళాల ఖర్చంతా నీ జీతంనించే కట్" అని బెదిరించాడు కూడా.

"మూర్తి చేతులు వణుకుతున్నాయి. వాడి మొహం వాడేం బద్దలు కొడతాడు, నేను క్షణాల్లో అన్ని తాళంకప్పల్నీ ఫట్‌ఫట్ లాడిస్తాను!" అంటూ మూర్తి చేతిలోంచి సుత్తిని ఉత్సాహంగా లాక్కున్నాడు సాంబిరెడ్డి.

"అన్ని తాళాలూ అక్కరలేదు. లేబరేటరీ తాళం ఒక్కదాన్ని పగలగొట్టండి చాలు" హఠాత్తుగా అన్నాడు సైన్స్ టీచర్ ప్రకాశం.

"ఏం? లేబరేటరీలో మిగతా గదుల డూప్లికేట్ తాళాలున్నాయా?" అనుమానంగా అడిగాడు సోషల్ టీచర్ ఆశీర్వాదం.

ఇంతలో సాంబిరెడ్డి వెళ్ళి, లేబరేటరీ తాళాన్ని ఒకే ఒక్క దెబ్బకి పగలగొట్టాడు. ప్రకాశం ప్రయోగశాలలో కెళ్ళి ఒక పెద్దసైజు అయస్కాంతపు రాడ్‌ని తీసుకొచ్చాడు. గేలాన్ని విప్పి. ఆ తాడుకి ఆ రాడ్‌ని గట్టిగా కట్టి, నూతిలోకి దింపి, ఒకసారి నూతిలో కవ్వం తిప్పినట్టు తిప్పి, పైకి లాగాడు.

అయస్కాంతానికి అతుక్కుంది తాళాల గుత్తి. నీటిపైకి రాగానే ఒక్కసారిగా ఎండలో తళుక్కుమంది. తాళాల గుత్తి పైకిరాగానే, దాన్ని తీసుకుని గదులవైపు పరిగెట్టాడు మూర్తి, మనసులోనే ప్రకాశానికి కృతజ్ఞతలు చెప్పుకుంటూ.

"శాస్త్రాన్ని జీవితానికి ఉపయోగించుకున్నప్పుడే సైన్సుకి సార్థకత!" అన్నాడు తెలుగు మాస్టారు ప్రకాశంవైపు ప్రశంసగా చూస్తూ.

హెడ్‌మాస్టారు, ఇతర మాస్టార్లే కాదు, పిల్లలూ ఎంతో మెచ్చుకున్నారు సైన్స్ మాస్టారు ప్రకాశాన్ని.

★

